జనపథం - జనపదం

## కొలువై ఉన్నాడే దేవదేవుడూ! - నిత్యానంద్.

'కొలువై ఉన్నాడే దేవదేవుడూ!' అంటే "ఎక్కడండి?" అని ప్రశ్నార్థకము ముఖంలో చూపెడితే ఎలాగండి? సర్వాంతర్యామి కదా! అంతటా ఉన్నాడు. 'ఇందుగలడందులేడని సందేహము వలదు, చక్రి సర్వోపగతుండు ఎందెందు వెదకి చూచిన అందందేగలడు!' అన్నాడు అలనాడు ప్రహ్లాదుడు. కాకపోతే మనచుట్టూ ఉన్న బంధువర్గం, మిత్ర వర్గం, ఇంకా మిగతా వర్గములవారు భిన్నమైన విశ్వాసములతో ఒక్కొక్కసారి మన నమ్మకాలని, విశ్వాసమును సవాలు చేసేటట్లు పరిణమిస్తారు. ఈ సృష్టిలో ఏ రెండు జీవాలు ఒకలా ఉండవు కదా! ఏ ఇద్దరి శ్వాసక్రియ ఒక్కమాదిరి సాగదు. ఏ ఇద్దరి అనుభవాలు ఒకటి కాదు. పరధర్మం కన్నా స్వధర్మము మిన్న. పరధర్మాన్ని ఎంత చక్కగా అనుష్టించినా, స్వధర్మానికి సాటిగాదు. ఒక వర్గం వారు 'దేహమే దేవాలయము - జీవుడే దేవుడు' అని చెప్తే అది వారికి నిజము. మరొక వ్యక్తి వారి స్థితికి చేరినపుడు, అది నిజమని అనిపించవచ్చు. కాని ఆధ్యాత్మికముగా ప్రాథమిక దశలో ఉన్న వ్యక్తికి ఇది ఆచరణయోగ్యం కాదు. పిల్లలకైనా గుణకారములు నేర్చుకొనడానికి ముందు సంకలన వ్యవకలనములను (కూడిక, తీసివేతలను) నేర్చుకోవాలి కదా! లేని పక్షంలో పునాది లేకుండా భవన నిర్మాణము చేపట్టినట్టే గదా! ఏ వ్యక్తి అయినా అంచెలంచెలుగా పరిణతి పొంది ఉచ్ఛస్థాయికి ఎదగాలిగాని, ఒకేసారి పై మెట్టుకి వెళ్ళిపోవాలంటే సాధ్యమా? ఎవరైనా అలా పై మెట్టుకి చేరుస్తామంటే అది అరచేతిలో స్వర్గం చూపెట్టినట్లవుతుంది. ఏ కొద్దిమందో - గురుకృపకు పాత్రులయితే - ఎలివేటర్‌లో పైకి చేరినట్టు సులభంగా ఉన్నత స్థితికి చేర్చగలరు. దీనికి ఆ వ్యక్తి కూడా సన్నద్ధుడై ఉండాలి. ఆ వ్యక్తి పైకి వెళ్ళేందుకు సుముఖంగా లేకపోతే, గుఱ్ఱమును చెరువు వద్దకు తీసుకునివెళ్ళవచ్చుగాని - దానిచే నీరు త్రాగించలేని చందమౌతుంది. ఒక్కొక్కసారి గురువు తలచుకుంటే ఆ వ్యక్తికి మంచి బాటయేదో దానిలోనికి ప్రవేశపెట్టనూగలడు. అనగా ఆ వ్యక్తి ఎన్నో సంవత్సరముల కాలములో గ్రహించగలిగే విషయాలను అతి తక్కువ సమయములో ప్రసాదించగలడు. ఆ కారణముగానే మన సంస్కృతి గురువును "గురుర్బ్రహ్మ గురుర్విష్ణు: గురుర్దేవో మహేశ్వర: గురుర్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీగురవే నమ:" అని స్తుతించింది. ఒక్కొక్కసారి భగవంతుని శాపాన్ని కూడా గురువు తప్పించిన సందర్భాలున్నాయి. కాని గురువు ఆగ్రహానికి గురైతే భగవంతుడు కూడా ఏమీ చెయ్యలేడు.

భగవంతుని కొలిచేవారు ఇలాగే కొలవాలని సూత్రీకరించలేము. యద్భావం తద్భవతి అని మనము ఏరూపములో ఆయనను స్మరిస్తే ఆ రూపంలోనే ఆయన మనల్ని అనుగ్రహిస్తాడు. భగవంతుని తండ్రిగా గౌరవించేవారు, తల్లిగా ప్రేమించేవారు, గురువుగా సేవించేవారు, పుత్రవాత్సల్యంతో అక్కున చేర్చుకునేవారు, సఖ్యభావంతో ఆత్మీయత చూపేవారు, సేవక భావంతో కొలిచేవారు, ఇలా వివిధమైన రీతుల్లో దర్శించినవారి దృష్టాంతాలు మనకు తెలిసినవే. ఉదాహరణకు శబరినే తీసుకుందాం. ఆమె రుచి

చూసిన పండ్లను రామునికి అర్పించింది. ఆమె ఆతిథ్యాన్ని రాముడు అంగీకరించలేదా? అలాగే తిన్నడు (కన్నప్ప) మాంసాహారాన్ని శివునికి అర్పించాడు. శివుడు ఆతనికి మోక్షాన్ని ప్రసాదించలేదా? ఇక్కడ భావం ప్రధానం కాని, వస్తువు కాదు. అన్నార్తులకు అర్పించేది సాక్షాత్తూ భగవంతునికి సమర్పించినట్టే. ఏ భావంతో అర్పిస్తున్నామన్నది ముఖ్యం. యశోద కృష్ణుని దండించింది పుత్రవాత్సల్యంతో. రామదాసు (కంచర్ల గోపన్న) రాముని తూలనాడాడు బాధలో. సేవకభావంతో కొలచిన అతనికి రాముడు ముక్తినొసగలేదా? అలాగే ఆ దేవదేవుని కొంతమంది పూజించి (రామకృష్ణుని వలె), కొంతమంది స్తుతించి (రామానుజాచార్యులు, శంకరాచార్యులు మొదలైనవారు), కొంతమంది కీర్తించి (త్యాగరాజ స్వామి, అన్నమయ్య, రామదాసు, మీరాబాయి మొదలైన వారు), కొంతమంది భజించి, ఇలా నవవిధములైన భక్తితో కొలిచారు. ఎవరి పద్ధతి వారికి సరియైనది. ఎదుటివారిలో తప్పులెంచబోవుట చాలా నీచమైన పని.

ఆ దేవదేవుడు నీలోనే ఉన్నాడని నమ్మినట్లైతే మనము ఉదయము లేచినది మొదలు తిరిగి నిద్రకు ఉపక్రమించేవరకు ప్రతి నిముషము ఆయన సేవచేస్తున్న భావనను పొందగలిగితే, అనగా మనము స్నానము చేస్తున్నప్పుడు అది మనలోని అంతర్యామికి అభిషేకము చేస్తున్నట్లు, మనము వస్త్రధారణ చేస్తున్నప్పుడు అది మనలోని పరమాత్మకు వస్త్రమును సమర్పిస్తున్నట్లు, మనము భోజనము చేసేముందు 'బ్రహ్మార్పణం బ్రహ్మహవి: బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతం బ్రహ్మైవతేన గంతవ్యం బ్రహ్మకర్మ సమాధినా' అని చెప్పి అది భగవంతునికి నైవేద్యముగా సమర్పిస్తున్న భావనతో తిన్నచో, వేరుగా భగవంతుని కొలవడం, దానికొక గంట సమయము కేటాయించడం అర్థము లేనిది. ఎందుకంటె నిత్యమూ మనము భగవంతుని స్మరణలో ఉన్నప్పుడు మళ్ళీ పూజ చెయ్యడము అనేది. మహాత్ములు దేనినైతే ఆచరిస్తారో మిగిలినవారు కూడా దానినే ధర్మముగా ఆచరిస్తారు. కావున మహాత్ములు విగ్రహముద్వారా పూజించడమనేదాన్ని ఖండించరు. భక్తునికి పరిపక్వత వచ్చిన తరువాత విగ్రహాలద్వారా పూజించడం కంటే నిత్య స్మరణలో గడపడం ఎలా ఉన్నతమైనదో తనకు తానుగా తెలుసుకునే అవకాశముంది. కావున గుడ్డు పిల్లగా కావాలంటే సమయము కొఱకు వేచి ఉండవలసిందే. ఆ క్షణములోనే పిల్ల కావాలంటే సాధ్యమా?

దీనిని బట్టి అర్థం చేసుకోవలసినదేమిటంటే 'కొలువై ఉన్నాడే దేవదేవుడూ - కొలువై ఉన్నాడే - కొలువై ఉన్నాడే కోటి సూర్య ప్రభాసుడె - మీలోనూ, నాలోనూ, మనందరిలోనూ! మనము ఎవరికంటే తక్కువా కాదు. ఎవరి కంటే గొప్పవారము కాదు.' అనగా ఆత్మన్యూనతా భావముగాని (ఇన్ఫీరియర్), అహంకారముగాని దరిచేరకుండా వసిద్దాం.

లోకాసమస్తా సుఖినోభవంతు! లోకాసమస్తా సుఖినోభవంతు! లోకాసమస్తా సుఖినోభవంతు! ఓం శాంతి శాంతి శాంతి:

*** *** ***